క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ బండారు



మక్తల్: జక్లేర్ బీరప్ప జాతరలో భాగంగా బుధవారం భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ బండారు ఘనంగా నిర్వహించారు. కొందరు మహిళలు తమ మొక్కులు తీర్చుకునేందుకు వేపకుతో పుట్టం కట్టుకొని ఊరేగింపు నిర్వహించారు. బండారు కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనను ఆలయ కమిటీ తరఫున సన్మానించారు. దేవరి మల్లప్ప, మహిపాల్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, పూజరి కుర్మయ్య, సీఐ సీతయ్య, ఎస్ఐ పర్వతాలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మక్తల్: పారేవుల గ్రామంలో శివాలయం నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి తనయుడు సిద్ధార్థరెడ్డి తన వంతుగా రూ. 25 వేలు విరాళం అందజేశారు. ఈ మేరకు సదరు చెక్కును సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డికి అందజేశారు. అనంతరం ఆయన సర్పంచ్ శాలువతో సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

15న క్రీడా పోటీలు

నారాయణపేట రూరల్ : వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 15న ఆర్మీ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని మినిస్టేడియం గ్రౌండ్‌లో రెండు రోజుల పాటు క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈ నెల 14న 100మీటర్లు, 200, 800మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్, వాలీబాల్ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలకు సంప్రదించాలన్నారు.

బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకోవాలి

నారాయణపేట రూరల్ : మండలంలోని కోటకొండ ఎస్‌బీహెచ్ బ్యాంకు అధికారులు అక్కడి ఖాతాదారులతో దురుసుగా ప్రవర్తించడం సరికాదని రేషన్ డీలర్ కే.సుధాకర్ ఒక ప్రకటనలో విమర్శించారు. గతంలో పనిచేసిన డీలర్ గుండప్ప దగ్గర బ్యాంకు అధికారులు పీఎం ఇన్సురెన్స్‌ను చేయించుకోగా, ప్రమాదవశాత్తు ఆయన మరణిస్తే దాన్ని క్లెయిమ్ చేసుకోడానికి కుటుంబ సభ్యులు బ్యాంకు వెళ్లారని అన్నారు. కాగా మూడు నెలలుగా వారిని తిప్పించుకుని, చివరకు హైదరాబాద్‌కు వెళ్లాలని ఉచిత సలహా చెప్పారని వాపోయారు. అక్కడికి వెళ్తే గడువు తీరిపోయిందని వెనిక్కి పంపారని, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు ఖాతాదారుల పట్ల దురుసుగా, ఇష్టారీతిగా మాట్లాడటం సరికాదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేసి బ్యాంకు అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వేధింపుల నుంచి రక్షించడమే లక్ష్యం



కోస్గి: మహిళల్ని, బాలికల్ని వేధింపుల నుంచి రక్షించడమే పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన షీ టీం ప్రధాన లక్ష్యమని, ఎవరైన బాలికలు వేధింపులకు గురౌతున్న, ఆకతాయిలు ఆకృత్యాలకు పాల్పడుతున్నా మౌనంగా భరించకుండా నేరుగా 100కు ఫోన్ చేయాలని టీం ఇన్‌చార్జ్ ఎస్సై సుధా మాధురి సూచించారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని బోగారం, ముశ్రీఫా జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీటీంలు ఉదయం, సాయంత్రం సమయాల్లో ఆర్టీసీ బస్టాండ్‌లు, విద్యార్థులు రద్దీగా ఉండే ఆటో స్టాండ్‌లతోపాటు ప్రధాన చౌరస్తాల్లో గస్తీ నిర్వహిస్తారన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఎస్సై శ్రీనివాసులు, హెచ్‌ఎంలు సత్యనారాయణ, బాలకృష్ణ, ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్వ విద్యార్థినికి గవర్నర్ ప్రశంస

నర్వ: పాలమూరు యూనివర్సిటీలో బీఫార్మసీ 3వ ఏడాది చదువుతున్న నర్వ మండలం యాంకి గ్రామానికి చెందిన నిఖిత రాష్ట్రస్థాయిలో ప్రశంసలు అందుకుంది. జీ–20 ప్రెసిడెన్సీపై యూనివర్సిటీ స్థాయిలో మంగళవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబరిచి మూడోస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా అవార్డు, ప్రశంసాపత్రం, నగదు పురస్కారం అందుకున్నట్లు విద్యార్థిని తల్లిదండ్రులు తెలిపారు.



పశువులతో బేజార్..

- యజమానుల నిర్లక్ష్యంతో రోడ్లపైకి వస్తున్న వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- బందరు దొడ్డి నిర్మించాలని ధర్నాలు చేసినా స్పందన కరువు



జిల్లాకేంద్రంలో సంచరిస్తున్న పశువులు(ఫైల్)

నారాయణపేట టౌన్ : పట్టణంలో ఎక్కడ చూసినా పశువులు రోడ్ల పై సంచరిస్తుండడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్ల వెంబడి తిరుగుతూ, ఎక్కడ పడితే వాహనాలకు అడ్డువస్తుండడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో నిత్యం పశువులు సంచరిస్తున్నాయి. దీంతో మార్కెట్‌కు వచ్చే ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అంతేకాకుండా రోడ్లపై ఉన్న చెత్త, ప్లాస్టిక్, పాడైన కూరగాయాలు తింటూ అనారోగ్యానికి గురై మృతి చెందుతున్నాయి. అయినా అధికారులు, వాటి యజమానులు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. గత నెల నాలుగు గోవులు మృతి చెందినా ఎవరూ స్పందించకపోవడంతో బజరంగ్‌దళ్ నాయకులు ముందుకు వచ్చి ఖననం చేశారు. కాగా పశువులతో పాటు కుక్కలు, మేకలు వంటివి విచ్చలవిడిగా తిరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న హరితహారం మొక్కలను మేకలు, గొర్రెలు తిని పాడుచేస్తున్నాయని అంటున్నారు. పశువులకోసం బందరుదొడ్లు ఏర్పాటు చేయాలని, లేదా సంరక్షణ శాలలకు తరలించడమో యజమానులకు అప్పగించడమో చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గోశాలకు తరలిస్తాం

పట్టణంలో రోడ్లపై తిరుగుతున్న పశువులను గోశాలకు తరలించేలా యజమానులకు సూచించాం. ఒకవేళ మళ్లీ మేకలు, ఆవులు కనిపిస్తే యాజమానులపై జరిమానా విధించేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికైనా పశువుల పెంపకందారులు రోడ్లపై వదలకుండా సహకరించాలి.
– సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



స్వయం పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

నారాయణపేట టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాల బోధన చక్కగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులుగా ఈశ్వర్, డీఈఓ, ఎంఈఓగా సీ.అభిషేక్, ఎం. అభిషేక్ వ్యవహరించి పాఠశాల పరిశీలన చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్‌రాం నాయక్ ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకొని, ఉన్నతస్థాయికి చేరుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు గుంపు బాలరాజ్, లక్ష్మారెడ్డి, జహంగీర్ హేమలత, అపర్ణ, నవ్యత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు 'కంటివెలుగు'పై అవగాహన సదస్సు

మద్దూరు: మండల పరిషత్ కార్యలయంలో గురువారం కంటివెలుగు కార్యక్రమంపై ఉమ్మడి మండల ప్రజాప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ సదస్సుకు మండల జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని ఆమె సూచించారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ల జీతాలు విడుదల చేయాలి

నారాయణపేట రూరల్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్ల బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహా డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. గత ఆరు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కుటుంబం గడపటం కష్టంగా మారిందన్నారు. అప్పులు చేసి వడ్డీలు కట్టుకోలేక ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని డిమాండ్ చేశారు.

కలలు నిజం చేసుకోవాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న షఫీ

నర్వ: విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తు కోసం కలలు కనాలి.. ఆ కలలను నిజం చేసుకోవాలని మోటివేషనల్ స్పీకర్ బ్రదర్ షఫీ అన్నారు. బుధవారం నర్వ ప్రతిభ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన డ్రీమ్‌రీచ్ బిగ్ అనే కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా బ్రదర్ షఫీ హాజరైనారు. పదోతరగతి విద్యార్థులు జరగబోయే పరీక్షలకు ఎలాంటి తడబాటు లేకుండా ప్రశాంతంగా ఇప్పటి వరకు నేర్చుకున్న సిలబస్‌ను నెమరు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులతో ఆయన ఇంటరాక్ట్ అయ్యి వారి నుండి సమాధానాలు రాబట్టారు. పాఠశాల కరస్పాండెంట్ హన్మంతురెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులపై అవగాహన అవసరం

దామరగిద్ద: పదో తరగతి అనంతరం ఉన్నత చదువులను ఎంచుకోవడంతో విద్యార్థులకు పూర్తి స్థాయి అవగాహన కల్గి ఉండాలని నిర్మాణ సంస్థ ప్రతినిధి రెడ్యానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని కాన్‌కుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎచ్ఎం విశ్వనాథ్ సమక్షంలో పదో తరగతి విద్యార్థులకు ఎస్బీపీ ఇండియా సహకారంతో గైడెన్స్ అందజేశారు. అనంతరం విద్యార్థులకు బుక్‌లెట్‌లు అందించారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎస్. విశ్వనాథ్, సంతోష్, సునిత, వెంకటప్ప, తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



నర్వ: పాథర్చేడ్ గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప నామస్మరణ మార్మోగింది. ఈ సందర్భంగా అయ్యప్ప మాలదారులకు మాశం నర్సిములు గురుస్వామి ఇరుముడి కట్టారు. ఇరుముడి ధారణ కార్యక్రమంలో వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పభక్తులు ఆయనను సన్మానించారు. అనంతరం అన్నదానం ఏర్పాటుచేశారు.

ఆపరేషన్ స్మైల్ బృందం దాడులు

నారాయణపేట రూరల్ : ఆపరేషన్ స్మైల్ పోలీసు బృందాలు బుధవారం ధన్వాడ, నర్వ మండలాల్లో జరిగాయి. ఈ సందర్భంగా మెకానిక్‌షాప్, హోటళ్లు, వెల్డింగ్ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు తదితర చోట్ల పనిచేస్తున్న ఐదు మంది బాలకార్మికులను గుర్తించారు. వెంటనే వారిని నారాయణపేట సీడబ్ల్యూసీ కార్యాలయంలో అప్పగించారు. తదుపరి పిల్లలు, వారి తల్లిదండ్రులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరు పర్చి కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు డీఎస్పీ చెప్పారు. దుకాణ యజమానులను జరిమానా విధిస్తామని చెప్పారు. బాలకార్మికులు కనిపిస్తే డయల్ 100కు తెలియచేయాలన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



మాగనూర్‌లో బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



పేటలో బహుమతులు అందిస్తున్న సీఐ రవిబాబు



దామరగిద్దలో బహుమతులతో విజేతలు



హిందూపూర్‌లో విజేతలతో ఎస్ఐ విజయభాస్కర్



మరికల్‌లో క్రీడాకారులతో సీఐ శ్రీకాంత్‌రెడ్డి

నారాయణపేట రూరల్ : యువత చదువుతో పాటు క్రీడలకు స్థానం కల్పించాలని సీఐ రవిబాబు అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి, విజేతలకు బహుమతులు అందించారు. ఎస్ఐ సురేష్, డీపై ఎస్‌ఓ కార్యాలయ ఇన్‌చార్జ్ సాయినాథ్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు జనార్దన్, పీఈటీలు పాల్గొన్నారు.

మాగనూర్: క్రీడలలో రాణిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్ రాజు, జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, వాకిటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: పెద్దచింతకుంట విద్యార్థులకు స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని బుధవారం వ్యాస రచన, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించారు. నిర్వాహకులు గురువారం బహుమతులను అందజేస్తామన్నారు.

కృష్ణా: హిందూపూర్ గ్రామ కూడలి నుంచి కృష్ణా పోలీస్ స్టేషన్ వరకు నిర్వహించిన 2కే రన్‌లో గెలుపొందిన యువకులకు బుధవారం ఎస్ఐ విజయభాస్కర్ బహుమతులను అందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు యువకులకు ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మరికల్: బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను బుధవారం సీఐ శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, సర్పంచ్ గోవర్ధన్, వైస్‌ఎంపీపీ రవి పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్ : లక్ష్మీపూర్ గ్రామంలో బుధవారం వాలీబాల్ పోటీలను సర్పంచ్ రామ్మోహన్ ప్రారంభించారు. ఎంపీటీసీ బాలమణి, పంచాయతీ కార్యదర్శి నవిత పాల్గొన్నారు.

దామరగిద్ద: సర్పంచ్ గురునాథ్ గౌడ్, మాజీ ఎంపీపీ కిష్టప్పలు బుధవారం కంసాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. బహుమతుల ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పనిభారం తగ్గించాలి



మాట్లాడుతున్న నర్సింహులు

నారాయణపేట టౌన్ : జలాల్‌పూర్ గ్రామంలో గుండెపోటుతో మరణించిన అంగన్‌వాడి టీచర్ అమ్ములమ్మ కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఐఎఫ్‌టీయూ అధ్యక్ష కార్యదర్శులు నర్సింహులు, కిరణ్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా పార్టీ కార్యాలయంలో భగత్‌సింగ్ భవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కార్మిక సంఘాల జిల్లా కమిటీ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అధికారుల పని ఒత్తిడి కారణంగానే అంగన్‌వాడి టీచర్ గుండెపోటుతో మరణించిందని, ఏ ఒక్క అధికారి పరామర్శించలేదని అన్నారు. ఇప్పటికైనా అంగన్‌వాడీ కార్యకర్తలకు పని బారం తగ్గించాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహా, నాయకులు నర్సింహులు, కనకప్ప, అంజి, ప్రజాపంథా నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేతిలోనే దేశ భవిష్యత్



పార్థనలో పాల్గొన్న సర్పంచ్

కోస్గి: విద్యార్థులను సక్రమ మార్గంలో నడిపించే ఉపాధ్యాయులపైనే పరోక్షంగా దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని వాచారం గ్రామ సర్పంచ్ వెంకట్రాములు అన్నారు. ఈ మేరకు బుధవారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఉదయం ప్రార్థన సమయంలో సందర్శించారు. పాఠశాలలో ఉన్న సమస్యలు, మధ్యాహ్న భోజనం ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు చదువుతోపాటు దేశ సంస్కృతి సంప్రదాయాలను వివరిస్తూ ఉత్తమ దేశ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఇందులో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం



బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

మరికల్: దేశంలోని రైతుల సంక్షేమం కోసమే బీఆర్‌ఎస్ పార్టీ పుట్టిందని ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. మరికల్‌లో నూతనంగా నిర్మించిన బీఆర్‌ఎస్ జెండాకట్ట వద్ద బుధవారం ఎమ్మెల్యే పార్టీ జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ టీఆర్‌ఎస్ నుంచి బీఆర్‌ఎస్‌గా ఆవిర్భావించిన తర్వాత రాష్ట్రంలోనే మొదటి బీఆర్‌ఎస్ జెండాకట్ట మరికల్‌లో నిర్మించడం గర్వంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంపై చూపుతున్న వివక్షత కారణంగానే ముఖ్యమంత్రి కేసీఆర్ దేశ అభివృద్ధి కోసం కొత్త పార్టీని స్థాపించారన్నారు. రాబోవు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తామన్నారు. తెలంగాణ ఏర్పాటు కావడం వల్లే నారాయణపేటను జిల్లాగా, మరికల్‌ను మండలంగా చేసుకోగలిగామన్నారు. మరికల్ మండల కాంప్లెక్స్ నిర్మాణం కోసం రూ. 7 కోట్లను మంజూరు చేయించమన్నారు. జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, వైస్‌ఎంపీపీ రవి, ఎంపీటీసీలు సుజాత, గోపాల్ సర్పంచ్ గోవర్ధన్, సురేఖ, మండల అధ్యక్షులు తిరుపతయ్య, శేఖర్, రాజవర్ధన్‌రెడ్డి, బసంత్, సంపత్, శ్రీనివాస్, రామస్వామి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జేవైఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ క్యాలెండర్‌ను మాజీ మండల అధ్యక్షులు యుగేందర్‌రెడ్డి ఖావకార్యం బుధవారం ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సుదీప్ రెడ్డి, బాల్‌రాజ్, సంపత్, గోవర్ధన్, మతిన్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

అనుబంధ రంగాలతో అదనపు ఆదాయం



రాయితీ కోడి పిల్లలు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్, తదితరులు



మద్దూర్‌లో కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కోస్గి: రైతులు వ్యవసాయంతోపాటు పాడి పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలు, పట్టుపురుగుల పెంపకం వంటి వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి సారిస్తే అదనపు ఆదాయం పొందవచ్చనని మున్సిపల్ చైర్ పర్సన్ మ్యాకల శిరీష సూచించారు. ఈ మేరకు బుధవారం స్థానిక పశు వైద్యశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో రాయితీపై అందజేసిన పెరటి కోళ్లను పంపిణీ చేశారు. మండల పరిధిలో దరఖాస్తు చేసుకున్న 25 మంది లబ్ధిదారులకు రాయితీ కోడి పిల్లలను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇందులో పశువైద్యాధికారి విజయలక్ష్మీ, జెడ్పీటీసీ ప్రకాష్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామకృష్ణ, నాయకులు రాజేష్ పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలోని లబ్ధిదారులకు బుధవారం మద్దూరులోని పశువైద్యశాలలో పెరటి కోళ్లను జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మద్దూరు సర్పంచ్ అరుణ చేతుల మీదుగా అందజేశారు. 45 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఒక నెల వయసున్న 25 కోడిపిల్లలను అందజేసినట్లు పశువైద్యాధికారి రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. వీరు రూ. 600 డీడీని డీవీఏహెచ్‌ఓ నారాయణపేట పేరు డీడీ కట్టడంతో వీరికి సబ్సిడీ కోడి పిల్లలను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది రాజశేఖర్, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద: కోళ్లను పెంచి ప్రయోజనం పొందాలని విండో అధ్యక్షుడు ఈదప్ప, పశువైద్యాధికారి సబిత అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కోడి పిల్లల యూనిట్లను పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 49 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. రైతులు నర్సిములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షకులు లేకుండా ట్రైనింగ్!



ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం డాక్టర్‌లకు ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 28 మంది కొత్తగా చేరిన పల్లె డాక్టర్‌లు పాల్గనగా వీరికి శిక్షణ ఇచ్చేవారు కరువయ్యారు. ధన్వాడ డాక్టర్‌ను ఈ నెల 1వ తేదీన వేరే మండలానికి ట్రాన్స్‌ఫర్ చేశారు. దీంతో పల్లె డాక్టర్‌లకు ట్రైనింగ్ ఇచ్చేందుకు ఎవరు లేకపోవడంతో ఆస్పత్రికి వస్తున్న రోగులకు వారే చికిత్సలు నిర్వహిస్తున్నారు. నేటికి డాక్టర్‌ను కేటాయించక పోవడంతో మండల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బడి బయటి పిల్లల గుర్తింపు

దామరగిద్ద: మండలంలోని మల్‌రెడ్డిపల్లి గ్రామంలో బుధవారం స్థానిక సర్పంచ్ చంద్రం, ఎస్ఎంసీ చైర్మన్ శివకుమార్ ఆధ్వర్యంలో స్థానిక యూపీఎస్ ఉపాధ్యాయుడు స్వామి, సీఆర్పీ మహిపాల్‌లు బడి బయటి పిల్లలను గుర్తించారు. వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడికి పంపించాలని కోరుతూ పేర్లు నమోదు చేసుకున్నారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.



నేడు సర్వ సభ్య సమావేశం

మక్తల్: మండల సర్వ సభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ తెలిపారు. సమావేశం ఎంపీపీ వనజ అధ్యక్షతన జరుగుతుందని, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలన్నారు.

ఊట్కూరు: మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కాలప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.